(సమగ్ర తెలుగు డిజిటల్ దినపత్రిక)

# ప్రజావేదిక

PRAJA VEDIKA TELUGU DAILY








తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ సంపుటి : 4 సంచిక : 236 (కాంప్లిమెంటరీ కాపీ) ఎడిటర్:వెంకన్న 06-06 - 2026 పేజీలు : 6 Digital Edition


## యుద్ధానికి ముగింపు పలుకుదాం.. పుతిన్‌కు జెలెన్‌స్కీ బహిరంగ లేఖ

యుద్ధాన్ని ముగించేందుకు నేరుగా చర్చలు జరపాలని ప్రతిపాదన

లేఖను పుతిన్ చదివారని వెల్లడించిన క్రెమ్లిన్ ప్రతినిధి పెస్కోవ్

చర్చలకు తాము సిద్ధంగానే ఉన్నామని రష్యా ప్రకటన

స్విట్జర్లాండ్, టర్కీ వంటి దేశాల్లో భేటీకి జెలెన్‌స్కీ సూచన



ఉక్రెయిన్–రష్యా యుద్ధానికి ముగింపు పలికే దిశగా అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో నేరుగా చర్చలు జరిపేందుకు సిద్ధమని ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీ ప్రతిపాదించారు.

## భారత ఏఐ ఆశలకు బిగ్ బూస్ట్.. ఆస్ట్రేలియన్ కంపెనీ రూ.2.50 లక్షల కోట్ల పెట్టుబడులు

భారత్‌లో డేటా సెంటర్ల ఏర్పాటు చేయనున్న ఎయిర్‌ట్రంక్

ప్రధాని మోదీతో సంస్థ సీఈఓ రాబిన్ ఖుదా భేటీ

5 గిగావాట్ల సామర్థ్యంతో సరికొత్త కేంద్రాలు

హైదరాబాద్, చెన్నై నగరాల్లో ప్రాజెక్టుల విస్తరణ



ఎయిర్‌ట్రంక్ నిర్ణయంపై ప్రధాని హర్షంభారత్‌ను అంతర్జాతీయ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), క్లౌడ్ కంప్యూటింగ్ హబ్‌గా మార్చే దిశగా చరిత్రాత్మక ముందడుగు పడింది. ఎయిర్‌ట్రంక్ నిర్ణయంపై ప్రధాని హర్షం

భారత్‌ను అంతర్జాతీయ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), క్లౌడ్ కంప్యూటింగ్ హబ్‌గా మార్చే దిశగా చరిత్రాత్మక ముందడుగు పడింది.



## మా పాలనలో పేపర్ లీక్ కాలేదు.. తెలంగాణలో నిషేధానికి గురైన కంపెనీకి కాంట్రాక్ట్ ఇచ్చారు: కేజ్రీవాల్

కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక లీకులు పెరిగాయని ఆరోపణ

వేల కోట్ల వ్యాపారంగా మారిన పేపర్ లీకులం

వెనుక పెద్ద మాఫియా ఉందని వ్యాఖ్య

లీక్‌లపై దేశవ్యాప్తంగా విద్యార్థులు, యువత నిరసనలు చేయాలని పిలుపు

కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు డిమాండ్

## ఏపీతో చర్చలు జరుగుతున్నాయి.. ఒక్క చుక్క నీటిని కూడా వదులుకోం: రేవంత్ రెడ్డి



పాలమూరు ప్రాజెక్టును సందర్శించిన రేవంత్ రెడ్డి

ఏపీతో సమస్యల పరిష్కారికే ప్రాధాన్యత ఇస్తామని వెల్లడి

బీఆర్ఎస్ హయాంలో పాలమూరు జిల్లా నిర్లక్ష్యానికి గురైందని విమర్శ

పాలమూరు ప్రాజెక్టు సందర్శన సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృష్ణా, గోదావరి జలాల పంపకాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో చర్చలు జరుగుతున్నాయని, త్వరలోనే తెలంగాణ ప్రజలకు శుభవార్త చెబుతామని ఆశాభావం వ్యక్తం చేశారు.



## మీ వైఫల్యాలను కేంద్రంపై నెట్టడం సరికాదు: రేవంత్ రెడ్డిపై ధర్మపురి అర్వింద్ ఫైర్

తెలంగాణలో దుమారం రేపుతున్న ధాన్యం కొనుగోళ్ల వ్యవహారం

రైతుల ధాన్యం తరలించడానికి లారీలు దొరకడం లేదా అని అర్వింద్ ఫైర్

సీఎం కేవలం విమర్శలకే పరిమితం అయ్యారని విమర్శ

తెలంగాణలో ధాన్యం కొనుగోళ్ల వ్యవహారం తీవ్ర రాజకీయ దుమారం రేపుతోంది. సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై నిజామాబాద్ బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ ఘాటుగా స్పందించారు.



## 198 ఎకరాల భూమి... విలువ రూ.30 వేల కోట్లు... కాపాడిన హైడ్రా!

పుప్పాలగూడలో 198 ఎకరాల ప్రభుత్వ భూమికి కంచె

రూ.30 వేల కోట్ల విలువైన ఈ భూమికి హైడ్రా రక్షణ

చారిత్రక రాతి నిర్మాణాలను కాపాడేందుకు చర్యలు

ఎన్జీవో ఫిర్యాదు, కోర్టు ఆదేశాలతో కదిలిన యంత్రాంగం

కబ్జాల నివారణకు హైడ్రా ప్రత్యేక డ్రైవ్

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా హైడ్రా ఒక భారీ ఆపరేషన్‌కు శ్రీకారం చుట్టింది. దశాబ్దాలుగా వివాదాల్లో నలుగుతూ, కబ్జాదారుల కబంధ హస్తాల్లో చిక్కుకునే ప్రమాదంలో ఉన్న అత్యంత విలువైన ప్రభుత్వ భూమిని రక్షించింది. రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం పుప్పాలగూడ–ఖాజాగూడ సరిహద్దుల్లో ఉన్న 198 ఎకరాల ప్రభుత్వ భూమిని శుక్రవారం హైడ్రా తన ఆధీనంలోకి తీసుకుంది.



## భూమిపై జీవం పుట్టుక పాత సిద్ధాంతాన్ని మార్చేసిన కొత్త పరిశోధన!

భూమిపై జీవానికి మూలంపై కొత్త సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన నాసా

భాస్వరం, నత్రజని బయటి గ్రహశకలాల నుంచి రాలేదని వెల్లడి

సూర్యుడికి దగ్గరగా ఉన్న వస్తువుల నుంచే ఇవి భూమికి చేరాయని నిర్ధారణ

బయటి పదార్థాలను భూమి వైపు రాకుండా గురు గ్రహం అడ్డుకుందని గుర్తింపు

ఇతర గ్రహాలపై జీవం అన్వేషణకు ఈ పరిశోధన కీలకం కానుంది.



## కేరళను ముంచెత్తుతున్న భారీ వర్షాలు.. ఐఎండీ హెచ్చరిక

కేరళలో తీవ్రరూపం దాల్చిన నైరుతి రుతుపవనాలు

ఐదు ఉత్తర జిల్లాలకు ఐఎండీ రెడ్ అలర్ట్ జారీ

శనివారం అతి భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరిక

పలుచోట్ల ఈదురు గాలులకు నేలకూలిన చెట్లు

కొండ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచన

జూన్ 4న కేరళను పలకరించిన నైరుతి రుతుపవనాలు ఒక్కసారిగా ఉగ్రరూపం దాల్చాయి. రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తుండటంతో భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ఈ సీజన్‌లో తొలిసారిగా రెడ్ అలర్ట్ జారీ చేసింది.

## కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో తెలంగాణ జల హక్కులకు తీవ్ర ప్రమాదం : హరీశ్ రావు



హైదరాబాద్ : కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో తెలంగాణ జల హక్కులకు తీవ్ర ప్రమాదం మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఫ్లోర్ డిప్యూటీ లీడర్ హరీశ్ రావు ఆరోపించారు. ఈ మేరకు శుక్రవారం సీఎం రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు.హైదరాబాద్ : కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో తెలంగాణ జల హక్కులకు తీవ్ర ప్రమాదం మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఫ్లోర్ డిప్యూటీ లీడర్ హరీశ్ రావు ఆరోపించారు.

ఈ మేరకు శుక్రవారం సీఎం రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు.

## యుద్ధానికి ముగింపు పలుకుదాం.. పుతిన్‌కు జెలెన్‌స్కీ బహిరంగ లేఖ

**యుద్ధాన్ని ముగించేందుకు నేరుగా చర్చలు జరపాలని ప్రతిపాదన**
**లేఖను పుతిన్ చదివారని వెల్లడించిన క్రెమ్లిన్ ప్రతినిధి పెస్కోవ్**
**చర్చలకు తాము సిద్ధంగానే ఉన్నామని రష్యా ప్రకటన**
**స్విట్జర్లాండ్, టర్కీ వంటి దేశాల్లో భేటీకి జెలెన్‌స్కీ సూచన**

ఉక్రెయిన్-రష్యా యుద్ధానికి ముగింపు పలికే దిశగా అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో నేరుగా చర్చలు జరిపేందుకు సిద్ధమని ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీ ప్రతిపాదించారు. ఈ మేరకు ఆయన పుతిన్‌కు రాసిన ఒక బహిరంగ లేఖను పుతిన్ స్వీకరించి, పూర్తిగా చదివినట్లు రష్యా అధ్యక్ష కార్యాలయం (క్రెమ్లిన్) అధికారికంగా వెల్లడించింది. రష్యా అగ్రశ్రేణి వార్తా సంస్థ 'టాస్' కథనం ప్రకారం, సెయింట్ పీటర్స్‌బర్గ్ అంతర్జాతీయ ఆర్థిక ఫోరమ్ (స్రా×జుఖీ) సదస్సు సందర్భంగా పుతిన్ ప్రెస్ సెక్రటరీ డిమిత్రి పెస్కోవ్ ఈ విషయాన్ని ధృవీకరించారు."మన మధ్య ప్రత్యక్ష చర్చల ద్వారా ఈ యుద్ధానికి ముగింపు పలుకుదాం. ఇందుకోసం నేను ఒక సమావేశాన్ని ప్రతిపాదిస్తున్నాను" అని జెలెన్‌స్కీ తన లేఖలో పేర్కొన్నారు. "యూరప్ దృష్టి మళ్లీ ఈ యుద్ధంపై పడే వరకు వేచి చూడటం సరికాదు" అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ శాంతి చర్చలకు ఆతిథ్యం ఇచ్చేందుకు స్విట్జర్లాండ్, టర్కీ, అరబ్ దేశాలు ముందుకు రావాలని ఆయన సూచించారు. చర్చలకు స్పష్టమైన తేదీని నిర్ణయించుకోవాలని కూడా ప్రతిపాదించారు.చర్చలు జరిగేంత కాలం పూర్తిస్థాయి కాల్పుల విరమణకు ఉక్రెయిన్ సిద్ధంగా ఉందని జెలెన్‌స్కీ తన లేఖలో హామీ ఇచ్చారు. "ఇది ప్రామాణికమైన పద్ధతి. ఒకరితో ఒకరు మాట్లాడుకోవడానికి నిజమైన నిశ్శబ్దాన్ని నెలకొల్పడమే ఉత్తమ మార్గం. ఇది కేవలం ప్రయత్నం కాదు, మీకు నిజంగా ఆసక్తి ఉంటే ఇది నిజమైన కాల్పుల విరమణ అవుతుంది" అని ఆయన వివరించారు. ఈ లేఖపై ప్రపంచ దేశాల నేతల నుంచి వచ్చిన స్పందనల గురించి కూడా పుతిన్‌కు తెలియజేశామని పెస్కోవ్ తెలిపారు.

ఈ పరిణామంపై పెస్కోవ్ స్పందిస్తూ, చర్చలను పునఃప్రారంభించాలని రష్యా కోరుకుంటోందని అన్నారు. "ప్రస్తుతం నెలకొన్న స్తబ్దత త్వరలోనే ముగుస్తుందని, చర్చలు మళ్లీ మొదలవుతాయని ఆశిస్తున్నాం. ఇప్పటికే అమెరికాతో పలు మార్గాల్లో సంప్రదింపులు జరుపుతున్నాం" అని ఆయన తెలిపారు. "పుతిన్ చర్చలకు ఎప్పుడూ సిద్ధంగానే ఉంటారు. రష్యాతో మాట్లాడకూడదనే తమ వైఖరిని యూరప్ దేశాలు విడిచిపెడితే, వారు కేవలం ఫోన్ చేసి మాట్లాడితే సరిపోతుంది" అని పెస్కోవ్ వ్యాఖ్యానించారు. అయితే, ఉక్రెయిన్‌తో వివాదం చాలా సంక్లిష్టమైనదని, అది అంత సులభంగా పరిష్కారమయ్యేది కాదని కూడా ఆయన అభిప్రాయపడినట్లు టాస్ నివేదించింది.

## మీ వైఫల్యాలను కేంద్రంపై నెట్టడం సరికాదు: రేవంత్ రెడ్డిపై ధర్మపురి అర్వింద్ ఫైర్

**తెలంగాణలో దుమారం రేపుతున్న ధాన్యం కొనుగోళ్ల వ్యవహారం**
**రైతుల ధాన్యం తరలించడానికి లారీలు దొరకడం లేదా అని అర్వింద్ ఫైర్**
**సీఎం కేవలం విమర్శలకే పరిమితం అయ్యారని విమర్శ**

తెలంగాణలో ధాన్యం కొనుగోళ్ల వ్యవహారం తీవ్ర రాజకీయ దుమారం రేపుతోంది. సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై నిజామాబాద్ బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ ఘాటుగా స్పందించారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన ప్రెస్ మీట్‌లో ఆయన మాట్లాడుతూ.. పాలన చేతకాకపోతే ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయాలి అంటూ రేవంత్ రెడ్డిపై విమర్శలు గుప్పించారు.

బీజేపీ నేతల ఇళ్ల ముందు ధాన్యం పోస్తామన్న సీఎం వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యంగా ఉన్నాయని అర్వింద్ మండిపడ్డారు. వరి కోతలు ప్రారంభం కాకముందే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాల్సింది పోయి, తన వైఫల్యాలను కేంద్రంపై నెట్టడం సరికాదన్నారు. "దొంగ ఇసుక, మొరం రవాణాకు లారీలు, ట్రాక్టర్లు అందుబాటులో ఉంటాయి కానీ.. రైతుల ధాన్యం తరలించడానికి మాత్రం లారీలు దొరకవా?" అంటూ ఆయన ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎఫ్‌సీఐకి లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం బకాయి పడిందని ఈ సందర్భంగా గుర్తుచేశారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న 'ఫ్యూచర్ సిటీ' ప్రాజెక్టుపైనా ఆయన విమర్శలు గుప్పించారు. ప్రస్తుతం ఉన్న నగర సమస్యలను గాలికొదిలేసి, కొత్త నగరాల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. నిరుద్యోగ భృతి, గ్రామీణ అభివృద్ధి, సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణలో కాంగ్రెస్ సర్కార్ పూర్తిగా విఫలమైందని ఎండగట్టారు. సీఎం ఇప్పటివరకు తెలంగాణ ప్రయోజనాల కోసం కేంద్రం ముందు బలమైన వాదన వినిపించలేదని, కేవలం విమర్శలకే పరిమితమయ్యారని ధ్వజమెత్తారు.

## కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో తెలంగాణ జల హక్కులకు తీవ్ర ప్రమాదం : హరీశ్ రావు

హైదరాబాద్ : కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో తెలంగాణ జల హక్కులకు తీవ్ర ప్రమాదం మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఫ్లోర్ డిప్యూటీ లీడర్ హరీశ్ రావు ఆరోపించారు. ఈ మేరకు శుక్రవారం సీఎం రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. ఎత్తిపోతల పంపుల నిర్వహణ విషయంలో 07-04-2026 నాడు లేఖ రూపంలో బీఆర్ఎస్ చేసిన హెచ్చరికలను ప్రభుత్వం పట్టించుకోలేదని మండిపడ్డారు. అందువల్లే నేడు పంపులు దెబ్బతిని, కాళేశ్వరం, దేవాదుల ప్రాజెక్టుల నిర్వహణలో వైఫల్యం చెందారన్నారు.తెలంగాణ ప్రభుత్వ అప్పులు

కృష్ణా జలాల వినియోగంలో తెలంగాణ కనిష్ఠ స్థాయికి పడిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీ 74 శాతం వినియోగిస్తే, తెలంగాణ 25 శాతానికే పరిమితమైందని పేర్కొన్నారు. రైతులు, తాగునీటి అవసరాలు, పరిశ్రమల భవిష్యత్తు ప్రమాదంలో పడేసిన కాంగ్రెస్ ప్రభుత్వం సోలార్ ఆధారిత విద్యుత్ విధానాలతో సాగునీటి రంగానికి ముప్పు ఉందని హెచ్చరించారు.అందుకే రైతు డిస్కం ప్రతిపాదనను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులకు 24 గంటల నాణ్యమైన విద్యుత్ ఇవ్వాలని, కాళేశ్వరం, దేవాదుల నిర్వహణకు తగిన నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ భవిష్యత్తును ప్రశ్నార్థకం చేయకుండా జల హక్కులు కాపాడాలి అంటూ రేవంత్ రెడ్డికి లేఖ రాసిన లేఖలో హరీశ్ రావు పేర్కొన్నారు.

## భారత ఏఐ ఆశలకు బిగ్ బూస్ట్.. ఆస్ట్రేలియన్ కంపెనీ రూ.2.50 లక్షల కోట్ల పెట్టుబడులు

**భారత్‌లో డేటా సెంటర్ల ఏర్పాటు చేయనున్న ఎయిర్‌ట్రంక్**
**ప్రధాని మోదీతో సంస్థ సీఈఓ రాబిన్ ఖుదా భేటీ**
**5 గిగావాట్ల సామర్థ్యంతో సరికొత్త కేంద్రాలు**
**హైదరాబాద్, చెన్నై నగరాల్లో ప్రాజెక్టుల విస్తరణ**
**ఎయిర్‌ట్రంక్ నిర్ణయంపై ప్రధాని హర్షం**

భారత్‌ను అంతర్జాతీయ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), క్లౌడ్ కంప్యూటింగ్ హబ్‌గా మార్చే దిశగా చరిత్రాత్మక ముందడుగు పడింది. ఆస్ట్రేలియాకు చెందిన ప్రముఖ డేటా సెంటర్ల సంస్థ 'ఎయిర్‌ట్రంక్' రాబోయే నాలుగేళ్లలో మనదేశంలో ఏకంగా 30 బిలియన్ డాలర్ల (సుమారు రూ. 2.50 లక్షల కోట్లు) భారీ పెట్టుబడులు పెట్టనున్నట్లు ప్రకటించింది. ఈ పరిణామంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు.ఈ భారీ ప్రాజెక్టు ద్వారా భారతదేశంలో ఐదు గిగావాట్ల సామర్థ్యం గల సరికొత్త డేటా సెంటర్లను నిర్మించనున్నారు. సిడ్నీ ప్రధాన కేంద్రంగా పనిచేసే ఎయిర్‌ట్రంక్ సంస్థకు అంతర్జాతీయ ఇన్వెస్టర్లు బ్లాక్‌స్టోన్, కెనడియన్ పెన్షన్ ప్లాన్ ఇన్వెస్ట్‌మెంట్ బోర్డ్ నిధులు సమకూరుస్తున్నాయి. ఈ ఏడాది ఆరంభంలో 'లుమినా క్లౌడ్‌ఇన్‌ఫ్రా' సంస్థను కొనుగోలు చేయడం ద్వారా ఎయిర్‌ట్రంక్ భారత మార్కెట్లోకి అడుగుపెట్టింది.

మోదీ శుక్రవారం ఎయిర్‌ట్రంక్ సీఈఓ రాబిన్ ఖుదాతో సమావేశమయ్యారు. అనంతరం 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ.. దేశ డిజిటల్ మౌలిక సదుపాయాల రంగంలోనే ఇది భారీ పెట్టుబడి అని కొనియాడారు. ఈ ప్రాజెక్ట్ వల్ల దేశంలో లక్షలాది ఉపాధి అవకాశాలు లభిస్తాయని, స్థానిక సప్లై చైన్ వ్యవస్థ బలోపేతం అవుతుందని, క్లౌడ్ రంగంలో భారత్ గ్లోబల్ లీడర్‌గా ఎదుగుతుందని మోదీ ఆశాభావం వ్యక్తం చేశారు.

ప్రస్తుతం ఎయిర్‌ట్రంక్ సంస్థ ముంబై, చెన్నై, హైదరాబాద్ నగరాల్లో 600 మెగావాట్ల సామర్థ్యంతో ప్రాజెక్టులను నిర్మిస్తోంది. తాజా రూ. 2.50 లక్షల కోట్ల పెట్టుబడితో ఈ సామర్థ్యాన్ని మరింత విస్తరించనుంది. ప్రపంచవ్యాప్తంగా ఏఐ రేసు తీవ్రమవుతోందని, పెట్టుబడులను ఆకర్షించడంలో భారత్ చూపిస్తున్న వేగం, పారదర్శకత తమను ఎంతగానో ఆకట్టుకున్నాయని రాబిన్ ఖుదా ప్రశంసించారు.

భారత్‌లో ఇప్పటికే గూగుల్ సంస్థ విశాఖపట్నంలో తన మొదటి ఏఐ హబ్‌ను ఏర్పాటు చేయడానికి 15 బిలియన్ డాలర్ల (2026-2030 మధ్య) పెట్టుబడులను ప్రకటించింది. అలాగే దేశీయ దిగ్గజాలైన రిలయన్స్ ఇండస్ట్రీస్, అదానీ గ్రూప్ కూడా ఏఐ, డేటా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కోసం సుమారు 100 బిలియన్ డాలర్లకు పైగా భారీ నిధులను కేటాయించాయి. ఈ భారీ పెట్టుబడుల ప్రవాహం భారత్‌ను ప్రపంచ డిజిటల్ అడ్డాగా మార్చబోతోంది.

## ఏపీతో చర్చలు జరుగుతున్నాయి.. ఒక్క చుక్క నీటిని కూడా వదులుకోం: రేవంత్ రెడ్డి

**పాలమూరు ప్రాజెక్టును సందర్శించిన రేవంత్ రెడ్డి**
**ఏపీతో సమస్యల పరిష్కారికే ప్రాధాన్యత ఇస్తామని వెల్లడి**
**బీఆర్ఎస్ హయాంలో పాలమూరు జిల్లా నిర్లక్ష్యానికి గురైందని విమర్శ**

పాలమూరు ప్రాజెక్టు సందర్శన సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృష్ణా, గోదావరి జలాల పంపకాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో చర్చలు జరుగుతున్నాయని, త్వరలోనే తెలంగాణ ప్రజలకు శుభవార్త చెబుతామని ఆశాభావం వ్యక్తం చేశారు. అయితే, ఏపీతో చర్చలు జరిపినా రాష్ట్ర చట్టబద్ధమైన వాటాలో ఒక్క చుక్క నీటిని కూడా వదులుకునే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. తాము 'పంచాయతీ' కంటే 'పరిష్కారానికే' ప్రాధాన్యత ఇస్తామని... పాలమూరు, డిండి పెండింగ్ ప్రాజెక్టులకు క్లియరెన్స్ వస్తేనే మిగతా చర్చలు ముందుకు సాగుతాయని తేల్చి చెప్పారు.పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పాలమూరు జిల్లా తీవ్ర నిర్లక్ష్యానికి గురైందని సీఎం మండిపడ్డారు. గత ప్రభుత్వం కనీసం భూసేకరణ పనులను కూడా పూర్తి చేయకపోవడం వల్లే ఒక్క ఎకరాకు కూడా సాగునీరు అందించలేకపోయారని విమర్శించారు. కష్టకాలంలో కేసీఆర్‌ను ఆదుకున్న పాలమూరును అధికారంలోకి వచ్చాక ఆయన పట్టించుకోవడం మానేశారని ఆరోపించారు. వలసల జిల్లా అయిన పాలమూరును సస్యశ్యామలం చేసేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్న సీఎం.. ఈ ప్రాజెక్టును పూర్తి చేసే బాధ్యతను తానే స్వయంగా తీసుకుంటున్నట్లు హామీ ఇచ్చారు.

## మా పాలనలో పేపర్ లీక్ కాలేదు.. తెలంగాణలో నిషేధానికి గురైన కంపెనీకి కాంట్రాక్ట్ ఇచ్చారు: కేజ్రీవాల్

తమ పదేళ్ల ఢిల్లీ పాలనలోగానీ, నాలుగేళ్ల పంజాబ్ పాలనలోగానీ ఇప్పటివరకు ఒక్క ప్రశ్నపత్రం కూడా లీక్ కాలేదని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) జాతీయ కన్వీనర్, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా పరీక్షా పత్రాల లీకేజీలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్న నేపథ్యంలో ఆయన కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.

కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పేపర్ లీకేజీలు సర్వసాధారణంగా మారాయని ఆయన ఆరోపించారు. దీని వెనుక ఉన్నత స్థాయి వ్యక్తులతో కూడిన ఒక పెద్ద మాఫియా ఉందని, ఇది వేల కోట్ల రూపాయల వ్యాపారంగా రూపాంతరం చెందిందని విమర్శించారు. రాజకీయ అండదండలు లేకుండా ఇటువంటి లీకేజీలు జరగడం అసాధ్యమని పేర్కొన్నారు. గతంలో ఢిల్లీలో తమ ప్రభుత్వం పటిష్ఠమైన పాలనా యంత్రాంగంతో పరీక్షల సమగ్రతను కాపాడిందని, ఇప్పుడు పంజాబ్ లో ఉన్న తమ ప్రభుత్వం కూడా అదే పంథాలో నడుస్తోందని తెలిపారు.

ఈ సందర్భంగా, గతంలో తెలంగాణలో నిషేధానికి గురైన ఒక సంస్థకు సీబీఎస్ఈ 12వ తరగతి ఆన్‌స్క్రీన్ మార్కింగ్ కాంట్రాక్టును అప్పగించడాన్ని ఆయన తప్పుపట్టారు. సదరు కంపెనీ చేసిన తప్పిదాల కారణంగానే గతంలో 20 మందికి పైగా విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని ఈ సందర్భంగా గుర్తుచేశారు. అపఖ్యాతి పాలైన అటువంటి సంస్థపై చర్యలు తీసుకోకపోవడాన్ని ప్రశ్నిస్తూ, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని కేజ్రీవాల్ డిమాండ్ చేశారు.

నీట్-యూజీ 2026 పేపర్ లీక్ ఆరోపణల నేపథ్యంలో పరీక్ష రద్దు కావడంపై కేజ్రీవాల్ స్పందించారు. ఈ లీకేజీల సమస్యకు వ్యతిరేకంగా విద్యార్థులు, యువత దేశవ్యాప్తంగా నిరసనలు చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రజల నుంచి తగినంత ఒత్తిడి రాకపోతే ఈ సమస్య ఇలాగే కొనసాగుతుందని, తద్వారా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందని ఆయన హెచ్చరించారు.

## 198 ఎకరాల భూమి... విలువ రూ.30 వేల కోట్లు... కాపాడిన హైడ్రా!

**పుప్పాలగూడలో 198 ఎకరాల ప్రభుత్వ భూమికి కంచె**
**రూ.30 వేల కోట్ల విలువైన ఈ భూమికి హైడ్రా రక్షణ**
**చారిత్రక రాతి నిర్మాణాలను కాపాడేందుకు చర్యలు**
**ఎన్జీవో ఫిర్యాదు, కోర్టు ఆదేశాలతో కదిలిన యంత్రాంగం**
**కబ్జాల నివారణకు హైడ్రా ప్రత్యేక డ్రైవ్**

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా హైడ్రా ఒక భారీ ఆపరేషన్‌కు శ్రీకారం చుట్టింది. దశాబ్దాలుగా వివాదాల్లో నలుగుతూ, కబ్జాదారుల కబంధ హస్తాల్లో చిక్కుకునే ప్రమాదంలో ఉన్న అత్యంత విలువైన ప్రభుత్వ భూమిని రక్షించింది. రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం పుప్పాలగూడ-ఖాజాగూడ సరిహద్దుల్లో ఉన్న 198 ఎకరాల ప్రభుత్వ భూమిని శుక్రవారం హైడ్రా తన ఆధీనంలోకి తీసుకుంది. సుమారు రూ.30,000 కోట్ల విలువ చేసే ఈ భూమిలో 250 కోట్ల సంవత్సరాల నాటి అరుదైన చారిత్రక రాతి గుట్టలు కూడా ఉండటం విశేషం. ఈ ఆపరేషన్‌తో అమూల్యమైన ప్రకృతి, చారిత్రక సంపదకు హైడ్రా రక్షణ కవచం ఏర్పాటు చేసింది.

గతంలో రాష్ట్ర ప్రభుత్వం హెచ్ఎండీఏకు కేటాయించిన ఈ భూమిలో అద్భుతమైన రాతి శిలలు, గుహలు, పచ్చని చెట్లు ఉన్నాయి. ఈ చారిత్రక సంపదను కాపాడాలంటూ 'సొసైటీ టు సేవ్ రాక్స్' ప్రతినిధులు దశాబ్దాలుగా న్యాయపోరాటం చేస్తున్నారు. వారి పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు, 2019లోనే ఈ రాతి గుట్టలతో పాటు ప్రభుత్వ భూమిని సంరక్షించాలని మున్సిపల్, రెవెన్యూ శాఖలను ఆదేశించింది. అయితే, హద్దులు గుర్తించి ఫెన్సింగ్ వేయడంలో జాప్యం జరగడంతో భూమి కబ్జాకు గురయ్యే ప్రమాదం ఏర్పడింది. దీంతో 'సొసైటీ టు సేవ్ రాక్స్' ప్రతినిధులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు.ఈ ఫిర్యాదుపై హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ వెంటనే స్పందించి, క్షేత్రస్థాయిలో పర్యటించారు. రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో కలిసి సంయుక్తంగా సర్వే నిర్వహించి, భూమిని ప్రభుత్వ ఆస్తిగా నిర్ధారించుకున్నారు. అనంతరం శుక్రవారం పటిష్టమైన ఫెన్సింగ్ ఏర్పాటు చేసే కార్యక్రమాన్ని చేపట్టారు.

రెవెన్యూ రికార్డుల ప్రకారం.. సర్వే నంబర్ 452/1లో 174 ఎకరాలు, 454/1లో 119.05 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇందులో ఓవర్‌ల్యాప్ సమస్యల కారణంగా 63.05 ఎకరాలు ప్రైవేటు వ్యక్తులకు చెందినదిగా గుర్తించి, మిగిలిన భూమిలో దేవాలయాలకు 5 ఎకరాలు, దర్గాకు 5 ఎకరాలు కేటాయించగా, నికరంగా 200 ఎకరాల హెచ్ఎండీఏ భూమిని హైడ్రా కాపాడింది.

ఈ ఆపరేషన్‌పై 'సొసైటీ టు సేవ్ రాక్స్' ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. సహజ సిద్ధమైన వ్యూ పాయింట్లు, చారిత్రక గుట్టలను కాపాడి, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసినందుకు హైడ్రాను అభినందించారు. స్థానిక ప్రజలు, పర్యావరణ ప్రేమికులు సైతం ప్రభుత్వ చొరవను కొనియాడారు. ఇదే సమయంలో, ఈ గుట్టలను ఆనుకుని ఉన్న భగీరథమ్మ చెరువును కూడా హైడ్రా పునరుద్ధరిస్తోంది. ఒకవైపు ఎత్తైన కొండలు, మరోవైపు జలకళతో నిండిన చెరువుతో ఈ ప్రాంతం భవిష్యత్తులో ఒక అద్భుతమైన పర్యాటక కేంద్రంగా విరాజిల్లుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

## కేరళను ముంచెత్తుతున్న భారీ వర్షాలు.. ఐఎండీ హెచ్చరిక

**కేరళలో తీవ్రరూపం దాల్చిన నైరుతి రుతుపవనాలు**
**ఐదు ఉత్తర జిల్లాలకు ఐఎండీ రెడ్ అలర్ట్ జారీ**
**శనివారం అతి భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరిక**
**పలుచోట్ల ఈదురు గాలులకు నేలకూలిన చెట్లు**
**కొండ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచన**

జూన్ 4న కేరళను పలకరించిన నైరుతి రుతుపవనాలు ఒక్కసారిగా ఉగ్రరూపం దాల్చాయి. రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తుండటంతో భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ఈ సీజన్‌లో తొలిసారిగా రెడ్ అలర్ట్ జారీ చేసింది. కేరళ ఉత్తర భాగంలోని ఐదు జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న నివేదికల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు.

శుక్రవారం ఉదయం కోజికోడ్ తదితర ప్రాంతాల్లో బలమైన ఈదురు గాలుల ధాటికి చెట్లు నేలకూలాయి. శనివారం మలప్పురం, కోజికోడ్, వయనాడ్, కన్నూర్, కాసర్‌గడ్ జిల్లాల్లో 24 గంటల వ్యవధిలో 20 సెంటీమీటర్ల కంటే ఎక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని ఐఎండీ అంచనా వేసింది. మరికొన్ని జిల్లాలకు ఆదివారం కూడా ఈ హెచ్చరికలు వర్తిస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది.మరోవైపు ఇడుక్కి, త్రిస్సూర్, ఎర్నాకుళం, కొట్టాయం, పాలక్కాడ్, పతనంతిట్ట జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్, అలప్పుజ, కొల్లం, తిరువనంతపురం జిల్లాలకు ఎల్లో అలర్ట్ ప్రకటించారు. రాబోయే రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తూ, ఉరుములతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.సాధారణ తేదీ కంటే ఆలస్యంగా రుతుపవనాలు ప్రవేశించినప్పటికీ, వాటి తీవ్రత అధికంగా ఉండటంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉన్న ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు లేదా సహాయక శిబిరాలకు తరలివెళ్లాలని రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ సూచించింది. పర్యాటక ప్రాంతాలు, నదులు, కొండ ప్రాంతాలకు ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని హెచ్చరించింది.

అత్యవసర సహాయం కోసం 1077, 1070 హెల్ప్ లైన్ నంబర్లను సంప్రదించాలని కోరింది. శుక్రవారం మధ్యాహ్నం వరకు ఎటువంటి ప్రాణనష్టం సంభవించలేదని, అధికారులు పరిస్థితిని నిరంతరం సమీక్షిస్తున్నారని సమాచారం

## గృహ హింస, బాల్య వివాహాలు, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు సమిష్టిగా కృషి చేయాలి



**-తాసిల్దార్ సిహెచ్ సుధాకర్**

**బోనకల్, జూన్ 5 ప్రజావేదిక ప్రతినిధి**

సమాజంలో మహిళల సాధికారత, సామాజిక భద్రత, కుటుంబ సంక్షేమాన్ని బలోపేతం చేసే లక్ష్యంతో బోనకల్ మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన జెండర్ వనరుల కేంద్రాన్ని బోనకల్ తాసిల్దార్ సిహెచ్ సుధాకర్, ఎంపీడీవో రమాదేవి, బోనకల్ గ్రామ సర్పంచ్ బానోతు జ్యోతి కొండ ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో కేంద్రం ద్వారా అమలు చేయనున్న సామాజిక కార్యక్రమాలను ఆవిష్కరించారు. సమాజంలో ఇంకా కొనసాగుతున్న అనేక సామాజిక సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే వేదికగా ఈ కేంద్రం పనిచేయనుందని వారు పేర్కొన్నారు. గృహ హింస రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా ప్రతి కుటుంబంలో పరస్పర గౌరవం, అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. బాల్య వివాహాలను పూర్తిగా అరికట్టి ఆడపిల్లలందరికీ నాణ్యమైన విద్య అందేలా ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు.మండలంలో ఏ చిన్నారి కూడా పనిలోకి వెళ్లకుండా అందరూ విద్యను అభ్యసించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. మద్యపాన వ్యసనాన్ని తగ్గించేందుకు అవగాహన కార్యక్రమాలు, సలహా సేవలను మరింత విస్తృతంగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు.అదేవిధంగా మానవ అక్రమ రవాణా, జోగిని, బసివిని, మాతంగి వంటి దురాచారాలతో పాటు మూఢనమ్మకాల నిర్మూలనకు ప్రజల సహకారం అత్యంత అవసరమని పేర్కొన్నారు. సమాజాన్ని వెనక్కి నెట్టే ప్రతి సామాజిక రుగ్మతను పారద్రోలి బోనకల్ మండలాన్ని జిల్లాలోనే ఆదర్శ మండలంగా తీర్చిదిద్దేందుకు అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## బోనకల్‌లో ప్రోటాన్ ఆగ్రో కెమ్ నూతన ప్రాంగణంలో పునఃప్రారంభం

**బోనకల్, జూన్ 5 ప్రజావేదిక ప్రతినిధి:**

బోనకల్ మండల కేంద్రంలోని ప్రోటాన్ ఆగ్రో కెమ్ పురుగుమందుల ఔట్‌లెట్ కొత్త చిరునామాలో శుక్రవారం ఘనంగా పునఃప్రారంభమైంది. ఖమ్మం రోడ్డులోని కొండాభాయ్ గ్యారేజ్ సమీపంలో ఏర్పాటు చేసిన నూతన ప్రాంగణంలో బోనకల్ గ్రామ ఉపసర్పంచ్ బానోతు కొండ శుక్రవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన పత్తి విత్తనాలు, గడ్డి మరియు కలుపు నివారణ మందులు, వివిధ రకాల పురుగుమందులు, సూక్ష్మ పోషకాలు కంపెనీ తయారీ ధరలకే అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. రైతులకు మెరుగైన సేవలు అందించడమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.ఈ సందర్భంగా బోనకల్లు మండలం మాజీ జెడ్పిటిసి బానోతు కొండ, సహకార సంఘం మాజీ అధ్యక్షులు గుండపనేని సుధాకర్ రావు మాట్లాడుతూ,వ్యవసాయమే మన దేశానికి వెన్నెముక. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అందుబాటులో ఉండటం ఎంతో అవసరం. ప్రోటాన్ ఆగ్రో కెమ్



సంస్థ బోనకల్‌లో కొత్త ప్రాంగణంలో ప్రారంభం కావడం రైతులకు మరింత ప్రయోజనకరంగా ఉంటుంది. రైతులకు అవసరమైన వ్యవసాయ ఉత్పత్తులను సరసమైన ధరలకు అందిస్తూ, వ్యవసాయాభివృద్ధికి తోడ్పడాలని కోరుతూ. సంస్థ నిర్వాహకులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను" అని అన్నారు.ఈ కార్యక్రమంలో.. పార కోటేశ్వరరావు, పార ప్రసాద్, తిరుపతిరావు, జరుపూల శివకృష్ణ, మరిదు శేషూ, షేక్ బాజీ, రైతులు, వ్యవసాయ రంగానికి చెందిన ప్రముఖులు, వ్యాపారవేత్తలు, స్థానిక ప్రజలు హాజరై శుభాకాంక్షలు తెలిపారు. రైతుల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ వ్యవసాయాభివృద్ధికి కృషి చేస్తామని నిర్వాహకులు వెల్లడించారు.

## బయ్యారంలో విత్తన టాస్క్ ఫోర్స్ అవగాహన సమావేశం.





**బయ్యారం,ప్రజా వేదిక న్యూస్,జూన్ 5.**

బయ్యారం మండల కేంద్రంలోని రైతు వేదికలో మండల విత్తన టాస్క్ ఫోర్స్ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశంలో గార్ల బయ్యారం సీఐ రవీందర్,తహసీల్దార్ నాగరాజు,మండల వ్యవసాయ అధికారి కే.రాజు మండలంలోని విత్తనాలు,ఎరువులు, పురుగుమందుల విక్రయదారులు పాల్గొన్నారు.ఈ సమావేశంలో నాణ్యమైన విత్తనాల విక్రయం,విత్తన చట్టాల అమలు,రైతులకు నాణ్యమైన వ్యవసాయ ఉత్పాదకాల అందుబాటు తదితర అంశాలపై చర్చించారు.అనంతరం బయ్యారం మండలంలో వరి,మొక్కజొన్న ధాన్య సేకరణ కార్యక్రమాలను విజయవంతంగా పూర్తి చేయడంలో అందించిన సహకారం,సమన్వయం మద్దతుకు గుర్తింపుగా బయ్యారం సీఐ,తహసీల్దార్‌లను వ్యవసాయ శాఖ వారు ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో మండల ఫర్టిలైజర్ అసోసియేషన్ అధ్యక్షులు సూరం సుధాకర్ రెడ్డి,ఇతర యజమానులు సతీష్,శేషగిరిరావు,శివ,విష్ణు,బాషా,క్రాంతి,కలింగరెడ్డి, మీరా,ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గ్రామ సభ నిర్వహించిన తిర్లాపురం గ్రామ సర్పంచ్ చాపల మడుగు వీరబాబు.



**చింతకాని జూన్ 5 ప్రజా వేదిక ప్రతినిధి: వీరబాబు.**

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా అందరం కలిసి ఒక సంకల్పం చేద్దామని గ్రామ సర్పంచ్ చాపల మడుగు వీరబాబు. పిలుపునిచ్చారు. శుక్రవారం పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు పై తిర్లాపురం గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామ సర్పంచ్ చాపల మడుగు వీరబాబు.తెలిపారు. . "ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా అందరం కలిసి ఒక సంకల్పం చేద్దాం. భూమి, మన ఇల్లు, ప్రకృతి మన జీవనాధారం. పర్యావరణాన్ని రక్షించుకోవడం మన బాధ్యత. సహజ వనరులను కాపాడుకుంటూ గాలి, నీరు, నేలను కలుషితం కాకుండా కృషి చేద్దాం. పచ్చదనం పెంపు, ఇంధన వనరులు పొదుపుగా వినియోగించడం అవసరం. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జూన్ 5న తిర్లాపురం అంగన్వాడి కేంద్రంలో ప్రతి ఒక్కరూ ఓ మొక్క నాటాలి ఈ సందర్భంగా తెలియపరిచారు. మన గ్రామంలో పర్యావరణ పరిరక్షణ సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తాను. అంతా సహకరించి మంచి కార్యక్రమానికి కలిసి రావాలని కోరుతున్నాను" అని తిర్లాపురం గ్రామ సర్పంచ్ చాపలమడుగు వీరబాబు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సెక్రెటరీ ఉమారాణి, అంగన్వాడి టీచర్ నాగ సీతారత్నం, అంగన్వాడి ఆర్గనైజర్, సత్యవతి, గోగుల నరసింహారావు, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు, గ్రామపంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక గ్రామసభ.





**బయ్యారం,ప్రజా వేదిక న్యూస్,జూన్ 5.**

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా బయ్యారం సర్పంచ్ అధ్యక్షతన ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ప్లాస్టిక్ నిషేధించడం,దానికి అనుబంధంగా మాజీ ఎంపీపీ కిషన్ నాయక్ సొంత ఖర్చులతో పర్యావరణహిత బ్యాగ్స్ పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సిబ్బందిని ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీడీవో మేడం దీపిక,ప్రాథమిక ఆరోగ్య కేంద్ర డాక్టర్ విజయ్ కుమార్,పోలీస్ శాఖ తరపున ఎస్సై ప్రశాంత్ బాబు,ఐసిడిఎస్ సూపర్వైజర్,రెవెన్యూ డిపార్ట్మెంట్ నుండి జిపిఓలు,పంచాయతీ కార్యదర్శి కే.రాంబాబు,ఉప సర్పంచ్ ఉమా,వార్డు సభ్యులు, వివిధ శాఖ అధికారులు,ప్రజాప్రతినిధులు,గ్రామ పుర ప్రముఖులు,గ్రామపంచాయతీ సిబ్బంది,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## రాజేశ్వరపురం సబ్ స్టేషన్ పరిధి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడును

**నేలకొండపల్లి జూన్ 5 ప్రజావేదిక న్యూస్**

**విద్యుత్ సరఫరా నిలిపివేత విద్యుత్ వినియోగదారులకు విజ్ఞప్తి...**

**విషయం ...నేడు అనగా 06-06-2026 శనివారం రాజేశ్వరపురం సబ్ సేష్టన్ మెయింటినెన్స్ కారణంగా**

రేపు ఉదయం 08:00గం నుండి మధ్యాహ్నం 11:00గం వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయడం జరుగుతుంది.. రాజేశ్వరపురం సబ్టేషన్ పరిధిలో గల రాజేశ్వరపురం మోటాపురం అమ్మగూడెం శంకరగిరి తండా గ్రామాలకు




విద్యుత్ అంతరాయం కలుగుతుంది. కావున విద్యుత్ వినియోగదారులు గమనించి విద్యుత్ సిబ్బందికి సహకరించవలసిందిగా కోరుచున్నా ము విద్యుత్ శాఖ. ఏ ఈ.

రాజేశ్వరపురం

## ప్లాస్టిక్ కరెన్సీ నోట్ల ప్రతిపాదన వాస్తవమే: ఆర్‌బీఐ గవర్నర్




హైదరాబాద్: భారతదేశంలో త్వరలోనే పాలిమర్ (ప్లాస్టిక్) కరెన్సీ నోట్లు చలామణిలోకి రాబోతున్నాయంటూ జరుగుతున్న ప్రచారంపై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) గవర్నర్ సంజయ్ మల్హోత్రా స్పష్టతనిచ్చారు. ప్రస్తుతం ఈ ప్రతిపాదనను పరిశీలిస్తున్న మాట వాస్తవమేనని, అయితే ఇది ఇంకా ప్రాథమిక దశలోనే ఉందని ఆయన పేర్కొన్నారు. దేశంలో పేపర్ కరెన్సీ వాడకం విపరీతంగా పెరిగిన నేపథ్యంలో, ప్లాస్టిక్ నోట్లను తీసుకురావడానికి గల సాధ్యాసాధ్యాలపై ఆర్‌బీఐ కసరత్తు చేస్తోంది. కాగితపు నోట్ల ముద్రణకు భారీగా ఖర్చు అవ్వడం, అవి త్వరగా పాడైపోయి చలామణి నుంచి తొలగించాల్సి రావడం వంటి కారణాల వల్లే ఈ ప్రత్యామ్నాయంపై ఆలోచిస్తున్నట్లు వెల్లడించారు.నిజానికి, ప్లాస్టిక్ నోట్ల ప్రస్తావన ఈనాటిది కాదు. 2014 ఫిబ్రవరిలోనే కేంద్ర ప్రభుత్వం దీనిపై పార్లమెంటుకు సమాచారం అందించింది. ప్రయోగాత్మకంగా రూ. 100 కోట్ల విలువైన ప్లాస్టిక్ నోట్లను ప్రవేశపెట్టాలని అప్పట్లోనే భావించారు. కానీ, కొన్ని సాంకేతిక, నిర్వహణ లోపాల వల్ల ఈ ప్రాజెక్టు తాత్కాలికంగా నిలిచిపోయింది. ఇప్పుడు ఆర్‌బీఐ మళ్లీ ఈ ఫైల్‌ను కదిలించడంతో త్వరలోనే దేశంలో ప్లాస్టిక్ నోట్లు అందుబాటులోకి వస్తాయనే ఊహాగానాలు ఊపందుకున్నాయి.

## గంజాయి నిర్మూలనే లక్ష్యంగా పోలీసుల తనిఖీలు.

### -ఎస్సై ప్రశాంత్ బాబు.

బయ్యారం,ప్రజా వేదిక న్యూస్,జూన్ 5.

మహబూబాబాద్ జిల్లాను గంజారహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు జిల్లా ఎస్పీ డాక్టర్ శబరిష్ ఆదేశాల మేరకు బయ్యారం మండలంలో పాన్ షాపులు నిర్మానుష ప్రాంతాలలో డాగ్ స్క్వాడ్ తో తనిఖీలు నిర్వహించినట్లు ఎస్సై ప్రశాంత్ బాబు తెలిపారు. శుక్రవారం మండలంలోని బయ్యారం సెంటర్ గాంధీ సెంటర్ ప్రధాన రహదారుల వెంట పాన్ షాపులు,బెల్ట్ షాపులలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. మద్యం సేవించే నిర్మానుస్య ప్రాంతాలు అయిన గాజుల బోడు,టేకుల బోడు తదితర ప్రాంతాలలో విస్తృత తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ గాంజా రవాణా చేసిన సేవించిన కఠిన చర్యలు తీసుకొని వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.గాంజా వల్ల యువత మత్తుకు బానిస అవుతున్నారని వారిని సక్రమ మార్గంలో ఉంచేందుకు తల్లిదండ్రులు అందరు వారి పిల్లల పట్ల ప్రత్యేక నిఘా ఉంచాలని కోరారు. గాంజా రవాణా సేవించేవారు ఉంటే తమకు సమాచారం ఇవ్వాలని వారి సమాచారాన్ని గోప్యంగా ఉంచి గంజా తాగే వారిని శిక్షిస్తామని తెలిపారు. నిర్మానుష ప్రాంతాలలో గాంజా సేవిస్తున్నట్లు అనుమానం వస్తే 8712656999 ఫోన్ కు కాల్ చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో



పాపారావు,కోటేశ్వరరావు,శ్రీను,రమేష్, సుబ్రహ్మణ్యం,పాషా,తదితరులు పాల్గొన్నారు.

### ప్రకృతిని కాపాడుకోవడం

## మన బాధ్యత

ఎవరికైనా చిన్నతనంలో ఆడే ఆటలు, చేసే పనులు కొన్ని మనసు మీద బాగా ప్రభావం చూపుతాయి. అవే పెరిగి పెద్దగయిన తర్వాత కొందరి జీవితంలో ప్రతిబింబిస్తాయి. అలా ప్రభావితం చెందిన వారే మధులిక. పర్యావరణం మనిషి మనుగడకు ఎంతో అవసరం. మనం ఆరోగ్యంగా, ఆనందంగా జీవించాలంటే పర్యావరణాన్ని కాపాడుకోవాలి. కానీ మనం చేతులారా వాతావరణాన్ని కాలుష్యం చేస్తున్నాం. నీరు, భూమి, గాలి అన్నీ కాలుష్యంగా మారి అనేక రోగాల బారిన పడుతున్నాం. ఈ కాలుష్య సమస్యల నుండి వాతావరణాన్ని కాపాడడం తన బాధ్యతగా భావించి ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. ఈరోజు ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఆమె చేస్తున్న కృషి గురించి నేటి మానవిలో...

చిన్నప్పుడు నేషనల్ జియోగ్రఫీ ఛానల్ బాగా చూసేదాన్ని. అది నాపై ఎంతో ప్రభావం చూపిందని చెప్పాలి. నిజానికి నేను చదివిన చదువుకు చేసే పనులకు ఎక్కడా పొంతన కూడా లేదు' అంటారు మధులిక. ప్రకృతి ప్రేమికురాలైన మధులిక చెరువులు ప్రక్షాళన చేయడం, చెరువు చుట్టూ మొక్కలు నాటడం వంటి కార్యకలాపాలకు శ్రీకారం చుట్టారు. ఈ విధంగా పర్యావరణ పరిరక్షణ కొరకు ఎంతో కృషి చేస్తున్నారు.

ప్రకృతి లేనిదే మానవ మనుగడ లేదు

మనిషికి ప్రకృతికి అవినావ భావ సంబంధం ఉంది. ప్రకృతి లేనిదే మానవ మనుగడ లేదు. అటువంటింది నేడు మనం ప్రకృతిని అనేకరకాలుగా ధ్వంసం చేస్తున్నాం. ముఖ్యంగా నదులు, సరస్సులు, చెరువులు మొదలైనవి. మానవ మనుగడకు నీరు ఎంతగానో అవసరం. అటువంటి నీటిని అపరిశుభ్రం చేస్తూ ఎందుకూ పనికి రాకుండా చేస్తున్నారు. మనం తాగే మంచినీటిలో కాలుష్యపు, మురికి నీరు వచ్చి కలవడం వల్ల ప్రజలు, జంతువులు అనారోగ్యాలకి గురవుతున్నారు. ఈ కాలుష్య వాతావరణం మధులికను ఎంతో కదిలించింది. పర్యావరణం కాపాడుకోవడం తన బాధ్యతగా భావించారు. ఇదే ఉద్దేశంతో అనేక కార్యక్రమాలు చేస్తున్నారు.

దేశంపై మమకారంతో...

రాజస్థాన్‌కి చెందిన మధులిక తల్లిదండ్రులు ఇద్దరూ శాస్త్ర వేత్తలు. ఉన్నత పదవుల్లో పని చేసి పదవీ విరమణ పొందారు. మిగిలిన కుటుంబ సభ్యులు కెనడాలో స్థిరపడ్డారు. భారతదేశం మీద ఉన్న మమకారంతో ఈమె మాత్రం ఇక్కడే స్థిరపడి పోయారు. తన చిన్నతనంలో నేషనల్ జియోగ్రఫీ ఛానల్ బాగా చూసేవారు. అది తనకు తెలికుండనే చాలా ప్రభావం చూపించింది. తన వయసుతో పాటే ప్రకృతిపై ప్రేమ కూడా పెరుగుతూ వచ్చింది. పెద్దయ్యాక పర్యావరణం పై మాస్టర్స్ చేద్దామని అనుకున్నారు. కానీ తల్లి తండ్రుల కోరిక మేరకు కంప్యూటర్ ఇంజనీరింగ్ చదివి అందులోనే ప్రొఫెసర్ గా చాలా ఏండ్లు పని చేశారు. అయినా ఆమె మనసు మాత్రం ప్రకృతి చుట్టూనే తిరుగుతూ ఉండేది. ఆ క్రమంలోనే 'ధృవాన్ష్' అనే స్వచ్ఛంధ సంస్థని స్థాపించి పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు చేపడుతున్నారు.

నేటి తరానికి చెప్పాలి

హైదరాబాద్ చెరువులకు పెట్టింది పేరు. తన పర్యావరణ పరిరక్షణ ప్రయాణం ఇక్కడి నుండి మొదలు పెట్టారు. 'ఇప్పటి తరం పిల్లలకు ఎంతసేపు వీడియో గేమ్స్, టీవీలు, మొబైల్ చూడటం తప్ప ప్రకృతితో వాళ్లకు అనుబంధం ఎక్కడ ఉంది? చెట్ల నుండి వీచే చల్లని గాలి అనుభూతి వారికి తెలుసా? పచ్చిక మీద, మట్టిలో చెప్పులు లేకుండా నడిచినప్పుడు ఆ ఆనందం ఎలా ఉంటుందో వారికి తెలియచెప్పే తల్లితండ్రులు ఈ రోజుల్లో కనిపించడం లేదు. ప్రకృతి ప్రాధాన్యం తెలియచెప్పడంలేదు. ప్రకృతి లేకపోతే మనుగడ లేదనే నిజాన్ని ఎవరూ పట్టించుకోవడం లేదు' అంటూ ఆమె మధులిక ఆవేదన చెందుతున్నారు.చెరువుల పరిరక్ష?ణకై...

నేటి పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ఆమె పర్యావరణ పరిరక్ష?ణ కోసం తన వంతుగా కృషి చేయడం ప్రారంభించారు. ముందుగా మణికొండ ప్రాంతంలో మొక్కలు నాటే అవకాశం వచ్చింది. అయితే దానికి బదులు గ్రీనరీ ఆఫ్ లేక్స్ చేపట్టాలని నిశ్చయించుకుని ఇబ్రహీం చెరువులో భాగమైన నెక్నపూర్ సరస్సు చుట్టు మొక్కలు నాటి, ఆ సరస్సు నీటిని శుభ్రం చేయాడానికి పూనుకున్నారు. చుట్టూరా వంద మొక్కలు నాటాలనుకున్నవాళ్ళు ఏకంగా మూడు వేల మొక్కలు నాటారు. ఇబ్రహీం చెరువు విస్తీర్ణం 150 ఎకరాలు. ఇందులో నెక్నపూర్ 70 ఎకరాలు. చెత్తకుప్పలా ఉన్న దాన్ని అందమైన ఉద్యానవనంలా మార్చారు. అంతే కాకుండా మిగిలిన 80 ఎకరాల నెక్నపూర్ చెరువు గుర్రపు డెక్కలతో నిండి ఉండేది. దాన్ని శుభ్రం చేయడానికి ఆమెకు దాదాపు ఆరు నెలల పైగా పట్టింది. ఒకప్పుడు చెత్తతో నిండి ఉన్న ఈ చెరువు ఇప్పుడు పచ్చదనంతో నిండి రకరకాల పక్షులకు విడిదిగా మారింది. అంతేకాదు చెరువుల ఒడ్డున మంచి ఉద్యాన వనాలను పెంచి, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించి సాయంత్రం పూట వ్యాహ్యాళికి వచ్చే వారికి వినోదాన్ని అందిస్తున్నారు.




## పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటాలి.

-ఎఫ్ఆర్ఓ రవి కిరణ్.

బయ్యారం,ప్రజా వేదిక న్యూస్,జూన్ 5.



పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతీ ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలని బయ్యారం ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ రవి కిరణ్ పిలుపునిచ్చారు. శుక్రవారం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం వేడుకలు రైతు వేదిక ప్రాంగణంలో మండల తాహశీల్దార్ నాగరాజు,గార్ల-బయ్యారం సీఐ రవీందర్,అటవీ శాఖ అధికారులు వివిధ రకాల మొక్కలను నాటారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పచ్చని చెట్లు జీవులకు ప్రాణవాయువు లాంటిదని అన్నారు. విరివిగా మొక్కలను నాటి సంరక్షించాలని,అడవులను కాపాడాలని వారు తెలిపారు. అనంతరం అటవీ శాఖ కార్యాలయం నుండి బయ్యారం బస్టాండ్ మీదుగా ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వరకు అడవులను కాపాడుతూ, పర్యావరణాన్ని పరిరక్షించాలని ప్రతి వ్యక్తి ఒక మొక్క నాటాలని బైకు ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో అటవీశాఖ డిఆర్ఓ రమాదేవి,బీట్ ఆఫీసర్లు, బేస్ క్యాంప్ సిబ్బంది,ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.